# మంచుతెర

## ఆచంట శారదాదేవి

రైలు వడివేగంగా పోతోంది. కిటికీ లోంచి చల్లని గాలి ధారాళంగా కంపార్ట్మెంటు అంతా నిండుతోంది. ఫస్టుక్లాసు కంపార్టుమెంటు ఖాళీగా ఉంది. సెకండ్ కంపార్ట్మెంటు. ఈ పక్క నుంచి ఆ చివరిదాకా ఉంది. ఎవరూ లేరు. ఈ చివర తన తాను కూర్చుంది. చివరన ఎవరో కుటుంబం పిల్లా పెద్దాలో కూర్చున్నారు.

సరోజ పుస్తకం తిరగవేస్తోంది. తన జీవితమే తనకొక కథలా ఉంది. మరి ఇంకొకళ్ళ కథలు తనకేం నచ్చుతాయి? చేతిలో పుస్తకం ఊరికే తిరగేస్తోంది. మనస్సు నిస్పృహలో నిండి ఉంది. పక్క సీటుమీద బాబు నిద్రపోతున్నాడు. ఎప్పుడు నిద్రలోనే ఏమిటో ఆరాటం. అందుకేనేమో ఏమీ ఎరుగనట్టు నిద్రపోతూనే ఉంటాడు. పాలు పడిన కొద్దీ గంటలు పోతాయి. ఇన్నాళ్ళ పెళ్ళి. వాడికీ తనకీ మధ్య మౌనం. పెరిగి పెద్దవాడయి ఏం చేస్తాడో! ఆలోచనలు అలా అల్లుకుంటాయి. అలలు పెనవేసుకుంటాయి.

అమ్మా నాన్నను చూడలేదా? ఏం బాధపడుతున్నావు? అసలు పిల్లలు. అసలు అటు చిక్కుల్లో ఉన్నారు. తను ఆఖరిది. తనూ గుంటూరు వెళ్ళి చాలా రోజులైంది, సెలవులు వచ్చిన పిల్లలు ఎగిరిపోతాయి. గూడు మిగులుతుంది శూన్యంగా, శూన్యంగా!

ఈసారి పుట్టింటికి వెళ్ళి అమ్మా నాన్నను చూసి నీరసపడి మరీ ఏడ్చేసింది. అమ్మ ముఖం అంతా ముడతలు పడి ఏమిటో మారిపోయి ఉంది. తప్పని సరిగా వంటా వార్పూ చేస్తోంది. నాన్న ఇరవై నాలుగు గంటలూ మంచంలోనో పడకకుర్చీలోనో కాలక్షేపం. ఎక్కువ తిరగలేడు. కళ్ళకు సరిగా కనపడదు. వాళ్ళిద్దరూ వొళ్ళు చూసుకోరు. తను నాలుగు రోజులుంది. వచ్చేసింది. వాళ్ళను గురించి తనకు దిగులు, ఏం చేస్తుంది! తన కాపురం తన సంసారం తనది,

ఈసారి పుట్టింటికి వెళ్ళినప్పుడు తన వీణ తనతో తెచ్చుకుంది. గదిలోనే పెట్టిన వీణ ఎదురుగుండా ఖాళీగా ఉన్న సీటుమీద బాబు పక్కన నిద్రపోతోంది. ఇంటికి వెళ్ళి దుమ్ము దులిపి తీగలు సరిచెయ్యాలి. ఇన్నాళ్ళ తరవాత మళ్ళా వాయించటానికి వేళ్ళు స్వాధీనమవుతాయో లేదో? మరుగుపడిన పాటలు మళ్ళా జ్ఞాపకం వస్తాయోలేదో! అతనికి సంగీతంలో, సాహిత్యంలో ఏమాత్రమూ ఆసక్తి లేదు. తను పాట వినాలన్న కుతూహలం అతనిలో ఉంటే, తను ఆ వీణ ఇదివరకే ఎప్పుడో అటుకు ఎక్కేది. అతను రైల్వే ఉద్యోగి. వారానికి నాలుగు రోజులు క్యాంపు! మిగతా నాలుగు రోజులు చీకటిలో వెళితే మళ్ళా రాత్రికే రాక! బాబు మెలకువగా ఉన్నప్పుడు ఎప్పుడూ అతను ఇంట్లో ఉన్నదే లేదు. తనకు ఈ జీవితం విసుగుపుడుతోంది. ఎక్కడో ఊరి చివర క్వార్టర్సులో కాపురం. రాత్రింబగళ్ళు రైళ్ళ కూతలు, దుమ్మూ ధూళీ! ఏం కాపురం? తినడానికి తిండి. ఉండడానికి ఇల్లు ఉంటే చాలునా మనిషికి? మనసుకు ఆకలివెయ్యదా? బహుశా ఈ భావాన్ని మొయ్యవలసిందే గదా!

బాబు నిద్రలో కదిలాడు. సరిగా పడుకోబెట్టింది. హఠాత్తుగా పక్కకు చూసింది. అవతల పక్క కూర్చున్నాయన వాళ్ళ పాపను ఎత్తుకుని వచ్చాడు, తనను పలకరించటానికి. ఎదురుగుండా సీటుమీద ఖాళీగా ఉన్నచోట కూర్చున్నాడు.

"ఏ ఊరు వెళుతున్నారు?"

సరోజ ముఖం వికసించింది. ఈ అపరిచిత వ్యక్తి పనికట్టుకు వచ్చి తనను పలకరించటం తనకెందుకో సంతోషంగా ఉంది.

"తిరపతి" సరోజ స్పష్టంగా జవాబు చెప్పింది.

అతను సంతోషించాడు.

"మేమూ తిరపతే వెళుతున్నాము. మా చంటివాడికి పుట్టు వెంట్రుకలు తీస్తాము. ఇది మా పెద్దపిల్ల. నేను పొగాకు కంపెనీలో పని చేస్తున్నాను. ఎప్పుడూ సెలవు దొరకదు. చాలా రోజులుగా అనుకుంటూ ఇప్పుడు బయలుదేరాము. అలా వస్తారా? మా అమ్మా, నాన్నా, మా ఆవిడ, పిల్లలూ అంతా వున్నారు. చూపిస్తాను."

తను బాబు పడకుండా పక్కన దిండు సర్ది పెట్టింది. లేచి వెళ్ళింది. అనుకోకుండా మనసులో గూడు కట్టుకున్న మంచుతెరలు విడిపోయి మనస్సు నిర్మలంగా వుంది.

అతను అందరినీ చూపించాడు. "ఈవిడ మా అమ్మ! ఈయన మా నాన్నగారు. గుంటూరులో నా దగ్గరే ఉంటారు, ఈవిడ మా ఆవిడ, వీడు రెండో వాడు, వీడు ఆఖరివాడు. వీడికే జుట్టుతీయించాలి. కొండమీద దర్శనం సులభంగా అవుతుందా? మీకు ఎవరన్నా తెలుసా? దర్శనం చేయిస్తారా?"

అతను ఎన్నాళ్ళగానో పరిచయం ఉన్నట్లు అలా మాట్లాడుతూనే ఉన్నాడు. వాళ్ళ కుటుంబం చూడ ముచ్చటగా వుంది. కళకళలాడుతూవుంది. సరోజ తన దిగులు మరచిపోయింది. వాళ్ళందరితో చాలా సేపు కబుర్లు చెపుతూ కూర్చుంది.

రైలు కూతవేసింది. స్టేషను వచ్చింది. సరోజ అటూ ఇటూ చూసింది. అతను, ఆమె భర్త స్టేషనుకు వచ్చారు. బాబును ఎత్తుకున్నాడు. అతనితో సరోజ గర్వంగా చెప్పింది. "ఈసారి వీణ తీసుకువచ్చాను." అని. సంతోషంగా వీణకేసి చేతితో చూపించింది. అతను వీణ చూసి చిరునవ్వు నవ్వాడు. ఏం మాట్లాడలేదు. ఆమె దిగి వెళుతూ వెళుతూ వెనక్కు తిరిగి చూసింది.

వాళ్ళ కుటుంబం పిల్లా పాపా అంతా హడావిడిగా సామాను సర్దుకుంటున్నారు. అంతా తన్ను చూసి ఆప్యాయంగా నవ్వుతున్నారు. తనూ నవ్వింది.

మంచుతెర మాసిపోయింది.

